క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 31 ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

అంతర్జాతీయ అవార్డు ప్రదానం


అవార్డుతో హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాస్టర్, ఫెయిత్ బంజార అనాథాశ్రమం నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ ప్లాటినమ్ లీడర్ షిప్ అవార్డు దక్కింది. డికె ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ వారు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తమిళనాడులోని పెరంబదూర్‌లో ఈ నెల 26న హన్యానాయక్‌కు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. హన్యానాయక్‌కు అంతర్జాతీయ అవార్డు రావడంతో పలువురు పాస్టర్లు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

సామాజిక తనిఖీ నిర్వహించాలని వినతి


హైదరాబాద్‌లో సీడీఎంఏ కార్యాలయం వద్ద వినతిపత్రంతో సామాజిక వేత్తలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో 15 ఏళ్ల పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై సామాజిక తనిఖీ నిర్వహించాలని కోరుతూ సమాచార హక్కు సలహా, సహాయ, రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక వేత్త సరికొండ రుషికేశ్వర్‌రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీలో 15 ఏళ్ల ఆడిట్ రిపోర్ట్స్, గ్రీన్ బడ్జెట్, అసైన్డ్‌ల్యాండ్, మార్టిగేజ్ వివరాలతో ఆర్‌టీఐ పత్రాలతో కలిపి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిలుముల కొండల్, దేవులపల్లి కార్తిక్ రాజు, ఉప్పుతల మహేష్ తదితరులున్నారు.

ఆలయంలో హోమాధి పూజలు


ఆంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు


హాలియా: అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో ఉన్న శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో 14వ వార్షికోత్సవ మహోత్సవ పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు రమేష్ శర్మ, రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


చేతి పంపును బాగుచేయిస్తున్న వెంకట్‌రెడ్డి

హాలియా: వార్డు ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు హాలియా మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో జగ్జీవన్‌రావు నగర్(పాత పశువుల సంత) బజార్‌లో పనిచేయని చేతిపంపునకు బుధవారం ఆయన మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న మృతుడి స్నేహితులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జాగటి యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆయన చిన్ననాటి స్నేహితులు బుధవారం మృతుడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు వెంకటమ్మ, హనుమంతు శ్రీనివాస్, అంజయ్య, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నాలాలు.. 32 కిలో మీటర్లు

- నేటి నుంచి మిర్యాలగూడలోని 15వార్డుల పరిధిలో పూడికతీత పనులు
- పదేళ్ల తర్వాత నాలాల్లో వ్యర్థాల తొలగింపునకు ప్రణాళిక
- పూడికతీత పనులకు రూ.50లక్షలు ఖర్చు అవుతాయని అంచనా


మిర్యాలగూడ : సీతారాంపురంలోని నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని రెండు ప్రధాన నాలాల్లో వ్యర్థాల తొలగింపునకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. వానాకాలం ప్రారంభమయ్యే నాటికి పట్టణంలోని బంగారుగడ్డ, హనుమాన్ పేట పరిధిలోని ప్రధాననాలాలు (వరద కాలువలు) శుభ్రపర్చాలని నిర్ణయించారు. అందులో భాగంగా రూ.50లక్షల అంచనా వ్యయంతో గురువారం నుంచి రెండు ప్రధాన నాలాల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఒక్కో నాలా 16 కిలోమీటర్లు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 48వార్డులుండగా బంగారుగడ్డ, హనుమాన్‌పేటల నుంచి ఈ వరద కాలువలు వెళ్తున్నాయి. ఈ రెండు ప్రధాన వరద కాలువల పొడవు ఒక్కొక్కటి సుమారు 16 కిలోమీటర్ల మేర ఉంటుంది. హనుమాన్‌పేట వరద కాలువ పట్టణంలోని ఏడు వార్డుల పరిధిలో విస్తరించి ఉంది. దీని పరిధిలోని హనుమాన్‌పేట, ముత్తిరెడ్డికుంట, రెడ్డికాలనీ, వినోభానగర్, సుందర్ నగర్, గాంధీనగర్, హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాల గుండా మురుగునీరు వెళ్తూ హౌసింగ్‌బోర్డు చిన్న చెరువులో కలుస్తుంది. అదే విధంగా బంగారుగడ్డ వరద కాలువ పరిధిలో 8 వార్డులుండగా నందిపాడు, సీతారాంపురం, రాంనగర్, షాబునగర్, బంగారుగడ్డ నుంచి కాలువ వెళ్తూ చివరకు హౌసింగ్‌బోర్డు చిన్న చెరువుకు చేరుకుంటుంది. ఈ రెండు నాలాలు 15 వార్డుల పరిధిలో 32కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్నాయి.

వ్యర్థాల తొలగింపునకు యంత్రాల వినియోగం

మున్సిపాలిటీలోని బంగారుగడ్డ, హనుమాన్‌పేటల్లోని వరద కాలువల్లోని వ్యర్థాలను తొలగించేందుకు అవసరమున్న చోట యంత్రాలను వినియోగించనున్నారు. ప్రధానంగా డోజర్లు, ట్రాక్టర్లు, జేసీబీలతో తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వరదకాలువల్లో నిండిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా బయటకు తీసి డంపింగ్ యార్డులను తరలించనున్నారు.

దశాబ్ద కాలం తర్వాత..

మున్సిపాలిటీలోని వరదకాలువల్లో సుమారు దశాబ్ద కాలం తర్వాత చేపడుతున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చాక 2014లో ఒక్కో కాలువకు రూ.10లక్షలు వెచ్చించి పూడికతీత పనులు చేపట్టారు. మళ్లీ దశాబ్దకాలం తర్వాత పూడికతీత పనులకు మోక్షం కలిగింది. ప్రస్తుతం పూడికతీత పనులకు ఒక్కో కాలువకు రూ.25లక్షల చొప్పున రూ.50లక్షలు కానున్నట్లు అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. ప్రధాన నాలాల వెంట నివాసం ఉంటున్నవారు మరుగుదొడ్లు నిర్మించుకోకుండా నేరుగా వరద కాలువలోకి వర్థాలు వదులుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే కాకుండా నాలాల్లో వివిధ రకాల మొక్కలు పెరగడంతో మురుగునీరు దిగువకు వెళ్లకుండా ఎక్కడికక్కడ నిలుస్తుండడంతో స్థానిక ప్రజలు దుర్వాసతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలు ఎక్కువగా పేరుకుపోయి ఉండడంతో ఖర్చు అంచనా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

నేటి నుంచి పనులు చేపడతాం



మున్సిపాలిటీలోని ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడితే కొన్ని ప్రాంతాల్లో రాళ్లు, ఇతర వస్తువులు వచ్చి చేరడంతో ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. కాలువల్లోని వ్యర్థాలను తొలగించేందుకు గురువారం నుంచి పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండి.

– వెంకన్న, మున్సిపల్ ఇన్‌చార్జి డీఈ, మిర్యాలగూడ

అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక


చంద్రుడునాయక్

హాలియా : వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సేవకులకు కళానిలయం (కల్చరర్, సోషల్ ఆర్గనైజేషన్) తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సమర్పణ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురుష్కరించుకొని అందజేసే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు–2024కు అనుముల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు జటావత్ చంద్రుడునాయక్ ఎంపికయ్యారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా గురుకుల కోచింగ్ శిక్షణ , దాతల సహకారంతో పాఠశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం, పాఠశాల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడం వంటి తదితర సేవలను గుర్తించి చంద్రుడు నాయక్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశామని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నిర్వాహకులు సురేందర్ పేర్కొన్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో శ్రీ త్యాగరాయగాన సభలో చంద్రుడునాయక్ ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని..



నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి వెంట నరికిన చెట్లు, (ఇన్‌సెట్)లో చెట్ల మొదళ్లు

- ఇష్టానుసారంగా చెట్ల నరికివేత
- మాడుగులపల్లి శివారులో ప్రైవేట్ పరిశ్రమ వ్యక్తుల నిర్వాకం
- పంచాయతీ అధికారి ప్రశ్నించినా నిర్లక్ష్యపు సమాధానం

మాడుగులపల్లి : మండల కేంద్రం శివారులోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట ఏపుగా పెరిగిన చెట్లను ప్రైవేటు పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఇష్టానుసారంగా నరికారు. కుక్కడం గ్రామ శివారులో ఓ సాల్వెంట్ పరిశ్రమ విద్యుత్ లైన్‌కు చెట్లు అడ్డు వస్తుండడంతో సరఫరాలో తరుచూ సమస్య తలెత్తుతుందని పరిశ్రయ యాజమాన్యం కూలీలతో చెట్లను తెగనరికించినటుల్ తెలిసింది. నిబంధనల ప్రకారం విద్యుత్ లైన్‌కు అడ్డు వచ్చే చెట్ల కొమ్మలను మీటర్ ఎత్తు వరకు మాత్రమే నరికేందుకు అనుమతి ఉంది. కానీ ఇక్కడ నిబంధన పాటించకుండా మొదళ్ల వరకు నరికారు. సుమారు అర కిలోమీటర్ మేర వందకు పైగా చెట్లను నరికి అక్కడే వదిలేశారు. విషయంపై విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారా? లేక వీరే నిర్ణయం తీసుకున్నారా? తెలియాల్సి ఉంది. ఆరేండ్ల క్రితం గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా రహదారి వెంట రాగి, వేప, జువ్వి, ఇతర మొక్కలు నాటించింది. ప్రస్తుతం అవి పెరిగి రహదారి వెంట ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా రహదారి వెంట చెట్లు నరికిన ఉదంతం తమ దృష్టికి వచ్చిందని, పరిశ్రయ నిర్వాహకులను అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు. వాల్టా చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు సైతం నివేదించినట్లు పేర్కొన్నారు.

'మిర్యాల'వాసికి నందమూరి స్వర్ణ నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న మూసా అలీఖాన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన నటుడు, నిర్మాత, మూసాఅలీఖాన్‌కు నందమూరి స్వర్ణనంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో బుధవారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ రుద్రరాజు పద్మారాజు, జహీరాబాద్ మాతాజీ చేతుల మీదుగా మూసాఅలీఖాన్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మూసా అలీఖాన్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు స్వర్ణనంది అవార్డును అందుకోవడం చాల ఆనందంగా ఉందన్నారు.

రూ.11వేల విరాళం అందజేత

దేవరకొండ: పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ నిధికి ఆ సంఘం సభ్యులు ఆలంపల్లి శ్రీనివాసులు–పద్మావతి(రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్) ప్రధానోపాధ్యాయుడు బుధవారం రూ.11,116ను అధ్యక్ష,కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళికి అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ భవన నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని అన్నా రు. కార్యక్రమంలో పంగునూరి లింగయ్య, గంగిడి దామోదర్‌రెడ్డి, ఐజాక్, యూసూఫ్ షరీఫ్, పురుషోత్తం ఉన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం : యువత స్నేహభావంతో క్రీడలు నిర్వహించుకోవాలి ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో త్రిపురారం ఫెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ఎస్ఐ వీర శేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువత క్రీడాల్లో రాణించాలని, ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు.కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, బాబుసాయిపేట ఎంపీటీసీ గట్టు యాదగిరి, కామర్ల జానయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, చిలుముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టేపని పూర్తి చేయాలి


మిర్యాలగూడలో యూనిఫాం కుట్టు పనిని పరిశీలిస్తున్న పీడీ కరుణాకర్

మిర్యాలగూడ టౌన్: పాఠశాలలు జూన్ 12వ తేదీన ప్రారంభం కానున్నందున.. అంతకు ముందుగానే యూనిఫాం అందజేసేలా కుట్టుపని పూర్తి చేయాలని నల్లగొండ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎరమాద కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్, ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాళ్లల్లో పొదుపు సంఘాల మహిళలు యూనిఫాం కుట్టే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టు నాణ్యతగా ఉండాలన్నారు. పట్టణ స్లమ్ సమాఖ్యల పరిధిలోని శ్రీనిధి బకాయిలు జూన్ 3వ తేదీ లోగా చెల్లించాలని, లేనిపక్షంలో వారిపై క్రిమినల్ కేసుతో పాటు ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

డిండి: విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.మైనొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. డీలర్లు కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలంలో బుధవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు,అంగడిపేటలో సారా తయారీకి కావాల్సిన బెల్లం విక్రయిస్తున్న వారిపై కేసు నమో దు చేశారు. బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలని మంత్రికి వినతి

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణం చుట్టూ ప్రస్తుతం నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డులో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతామని, అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్తులు అమ్మి నల్లగొండ పట్టణంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కొన్నామని, రోడ్డు నిర్మాణంలో వాటిని కోల్పోతే నిరాశ్రయులవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, వివాహాలు, వారి భవిష్యత్ కోసం ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశామని వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సుధాకర్‌రెడ్డి, జానారెడ్డి, రాజయ్య, శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

రేపు వాహనాల వేలం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు సంప్రదించాలని కోరారు.

దేవరకొండలో..

దేవరకొండ: దేవరకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 31న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొన దలచిన వారు టూ వీలర్ వాహనాలకు రూ.10వేలు,ఫోర్ వీలర్ వాహనాలకు రూ.30వేలు డిపాజిట్ చేసి 31న 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

నకిరేకల్ : తాటి చెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. నకిరేకల్‌లోని 15వ వార్డులో నివాసం ఉంటున్న గీతకార్మికుడు కొండ సైదులుగౌడ్ రోజువారీ మాదిరిగా నకిరేకల్ శివారులో తాటి చెట్లు ఎక్కేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మోకు జారి కింద పడిపోయాడు. దీంతో సైదులుగౌడ్‌కు బలమైన గాయాలయ్యాయి. అతడిని కుటుంబ సభ్యులు నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ ఆస్పత్రికి చేరుకుని సైదులును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ షఫి

మిర్యాలగూడ : విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏఈవో ఎండి.షఫి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, రశీదు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని, బీటీ 3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. నేల భూసారం పెరగడానికి పచ్చిరొట్ట విత్తనాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సబ్సిడీపై అన్నారం, మిర్యాలగూడ పీఏసీఎస్, నందిపాడు టీఎస్ సీడ్స్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

దేవరకొండ: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ అందుబాటులో ఉంచినట్లు దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆయా పీఏసీఎస్‌ల పరిధిలో గల కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై ఇప్పటికే పచ్చిరొట్ట ఎరువులను సరఫరా చేసినట్లు ఆమె తెలిపారు. 123క్వింటాళ్ల జీలుగ, 60 క్వింటాళ్ల జనుము రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను అదనంగా 90క్వింటాళ్ల జీలుగ, 20 క్వింటాళ్ల జీలుగ అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.సబ్సిడీపై ఈ విత్తనాలు పొందేందుకు రైతులు పట్టాదారు పాస్‌బుక్,ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. 30కేజీల జీలుగ బస్తా రూ.1116లకు 40కేజీల బస్తా జనుము సబ్సిడీపై రూ.1448 అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు


విత్తన దుకాణంలో రికార్డులు చూస్తున్న ఏఓ సరిత

మిర్యాలగూడ : విత్తన దుకాణాదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఏవో సరిత హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. విత్తన ధరలు, స్టాక్ వివరాలను దుకాణం ఎదుట స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఎవరైనా నాణ్యత లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు రసీదు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు భద్రపరుచుకోవాలని సూచించారు.

విత్తన దుకాణాల తనిఖీ

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను మంగళవారం ఏఓ అర్చన పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తనాలను విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈఓలు మహేష్‌నాయక్, రావుల నరేష్ తదితరులున్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి


పెద్దవూర : ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ సందీప్


వేములపల్లి: రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏఓ రుషేంద్రమణి

పెద్దవూర : లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్దనే రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని ఏఓ సందీప్ సూచించారు. బుధవారం మండలంలోని పులిచర్ల క్లస్టర్ పరిధిలోని పాల్తి తండా, పిన్నవూర, చలకుర్తి, తుంగతుర్తి గ్రామాల్లో పత్తి విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్యాకింగ్ లేకుండా, గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. అనంతరం పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏఈవో రాములు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

కొండమల్లేపల్లి : లైసెన్స్ కలిగి ఉన్న దుకాణాల్లోనే రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని 20 దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు సంబంధించి రషీదును పొందాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్య చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడి

వేములపల్లి: రైతులు వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట సాగుకు సంబంధించి జీలుగ విత్తనాలు చల్లుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ రుషేంద్రమణి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రైతులకు జీలుగ విత్తనాలను అందించి ఆమె మాట్లాడారు. ఎకరానికి 12కేజీల చొప్పున జీలుగ విత్తనాలను చల్లి 45 రోజుల తరువాత జీలుగలు పూత దశలో ఉన్నప్పుడు దున్నినట్లయితే భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ రవీందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

కట్టా మమతకు ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళి

మాడుగులపల్లి : మండలంలోని మద్రిగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కట్టా మమత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందింది. ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలు మమత ప్రస్తుతం మండలంలోని కొత్తగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె మృతి పట్ల పాఠశాల సిబ్బంది సైతం విచారం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన త్రిపురారం మండల కేంద్రంలోని విద్యానగర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి


కొండమల్లేపల్లి మండలం పకీర్‌పురం గ్రామ శివారులో గేదెల కళేబరాలు

కొండమల్లేపల్లి : విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని పకీర్‌పురంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మద్దిమడుగు వెంకటయ్య, నాగిరెడ్డి, గుండాల లింగయ్యకు చెందిన మూడు గేదెలను రోజు వారీగానే మేత కోసం తీసుకెళ్లారు. గ్రామం మీదుగా నేనావత్‌తండాకు వెళ్లే విద్యుత్ వైర్లు నేలకు తాకి ఉండడంతో అటుగా వెళ్లిన గేదెలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి.నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని బాధితులు, గ్రామస్తులు కోరుతున్నారు.